ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టర్ బదావత్ సంతోశ్

బ్యాంకులో రైతుల ఖాతాలను పరిశీలిస్తున్న కలెక్టర్

తిమ్మాజిపేట, జూలై 23 : ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ బదావత్ సంతోశ్ ఆదేశించారు. మంగళవారం తిమ్మాజిపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీలు చేశారు. రుణమాఫీ పరిష్కార కేంద్రం సందర్శించారు. ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలించి బ్యాంకులో రుణమాఫీ ప్రక్రియను పరిశీలించారు. ప్రజాపాలన దరఖాస్తు దారులు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయల గ్యాస్ సిలిండర్ పొందేందుకు లబ్ధిదారుల దరఖాస్తుల సవరణ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పులు దొర్లిన అర్హులైన లబ్ధిదారులను అసౌకర్యాలకు గురిచేయకుండా తప్పులను సరిచేసి ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందేవిధంగా చూడాలన్నారు. ప్రజాపాలన సవరణ కేంద్రం వద్ద లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ సమస్యలకు పరిష్కారం కాకుంటే నేరుగా తనకు కలవచ్చని కలెక్టర్ లబ్ధిదారులకు తెలిపారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం తిమ్మాజిపేట రైతు వేదికలో కొనసాగుతున్న రుణమాఫీ సమస్యల పరిష్కార కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడికి వచ్చిన రైతులకు రుణమాఫీ ఎందుకు జరగలేదో వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అందుకు కారణాలను రైతులకు వివరించి రుణమాఫీ డబ్బులు వెంటనే రైతుల ఖాతాలో జమ అయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. నేరళ్లపల్లి నుంచి వచ్చిన శాంతమ్మ తన భర్త శ్రీను ఇటీవల మరణించాడని, తమకు రైతు బీమా డబ్బులు రాలేదని కలెక్టర్‌కు తెలిపింది. అందుకు కలెక్టర్ వెంటనే స్పందించి వ్యవసాయ అధికారిని అడిగి తెలుసుకున్నారు. డెత్ సర్టిఫికెట్ అందలేదని, అందిన వెంటనే రైతుబీమా డబ్బులు జమ అయ్యేలా చేస్తానన్నారు. ఏదైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ధరణి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తాసీల్దార్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట తాసీల్దార్ జీకే మోహన్, ఎంపీడీవో లక్ష్మీదేవి, ఏవో కమలేశ్వర్, అధికారులు ఉన్నారు.

మెరుగైన విద్యను అందించాలి

బిజినేపల్లి, జూలై 23: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సంతబజార్‌లోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం 5వ తరగతి విద్యార్థులకు గణితంలో భాగహారాలు, తీసివేతలకు సంబంధించిన సామర్థ్యాలను పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజనతీరును పరిశీలించారు. పాఠశాలలో వర్షానికి నీరు కారుతున్న గదిని పరిశీలించి అందుకు కావాల్సిన ప్రతిపాదనలను తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా రూ.9.5లక్షలతో పాఠశాలకు కావాల్సిన నిర్మాణ పనులు, మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. అనంతరం మండల పరిధిలోని మంగనూర్ గ్రామ శివారులో ఉన్న 801 సర్వే నెంబర్‌లో ఆదర్శ పాఠశాలకు కావాల్సిన స్థలాన్ని పరిశీలించారు. నియోజకవర్గ పరిధికి సంబంధించి ఇంటిగ్రేటెడ్ ఆదర్శ పాఠశాల నిర్మాణానికి 20 ఎకరాల స్థలం కావాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ భూమిని గుర్తించాలని స్థానిక తాసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రమాదేవి, తాసీల్దార్ శ్రీరాములు, ఎంపీడీవో రాములునాయక్, కార్యదర్శి మహేశ్ ఉన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

- జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్

రైతులతో వివరాలను తెలుసుకుంటున్న చంద్రశేఖర్

లింగాల, జూలై 23 : అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింస్తుందని రైతులు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో రుణమాఫీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 నుంచి 2023డిసెంబర్ లోపు రుణాలు తీసుకున్న రైతులకు మూడు విడతల్లో రుణాలు మాఫీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మొదటి విడతలో రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులకు మాత్రమే మాఫీ వర్తిందన్నారు. రెండో విడతలో రూ.1.50లక్షలు, మూడో విడతలో రూ.2లక్షల లోపు ఉన్న రైతులకు రుణ మాఫీ అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి, ఏఈవోలు శివానంద్, సీఈవో పాండు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు, సీజనల్ వ్యాధులపై కళాజాత

అమ్రాబాద్, జూలై 23 : కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పౌర సమాచార సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక కళాకారులతో అమ్రాబాద్ మండల కేంద్రంలో మాదకద్రవ్యాలు, సీజనల్ వ్యాధుల పై మంగళవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కళాజాతలో యువత మాదకద్రవ్యాలు (గంజాయి, మత్తుపదార్థాల)కు బానిసలై చెడుదారిపడుతున్నారని వాటికి దూరంగా ఉండి భవిష్యత్తులో ముందుకు వెళ్లాలని తెలిపారు. అదేవిధంగా వానకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

తమ చుట్టూ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకుంటూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు భాస్కర్, జల్లికృష్ణ, శివనాగులు, నరేందర్, శివయ్య, సికిందర్, పార్వతమ్మ, అస్మా, రేణుక పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

- ఆరు కొత్త విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు

అచ్చంపేటరూరల్, జూలై 23 : అచ్చంపేట నియోజకవర్గంలోని రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తామని, అందుకు ఆరు కొత్త విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరైనట్లు విద్యుత్ శాఖ అచ్చంపేట ఏడీఏ కామేశ్వర్ రావు తెలిపారు. విద్యుత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆరు సబ్ స్టేషన్లకు గానూ ఒక్కొక్క సబ్‌స్టేషన్ రూ.2.5కోట్లతో నిర్మించనున్నారని తెలిపారు. అచ్చంపేట మండలం సింగారం గ్రామం, లింగాల మండలం బాకారం, బల్మూర్ మండలం గట్టు తుమ్మన్, ఉప్పునుంతల కంసానిపల్లి, పదర మండలంలో పదర, వంగూరు మండలం ఉల్పర గ్రామాలకు 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. మంజూరైన ఆరు గ్రామాల్లో ప్రభుత్వ స్థలం అర ఎక ర గుర్తించి త్వరలో పనులను మొదలు పెడతామన్నారు. సమావేశంలో అచ్చంపేట ఏఈ ఆంజనేయులు ఉన్నారు.

పారిశుధ్యం పనులు చేపట్టాలి

- సింగిల్ విండో మాజీ చైర్మన్ బుచ్చారెడ్డి

కోడేరు, జూలై 23 : కోడేరు మండలంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో డ్రైనేజీ సమస్యల వల్ల మురుగు నీరు రోడ్లపై నిలిచాయని నర్సాయపల్లి సింగిల్‌విండో మాజీ చైర్మన్ జంబుల బుచ్చారెడ్డి తెలిపారు. దీంతో గ్రామస్తులకు అంటు రోగాల ప్రభలే అవకాశాలు ఉన్నందున అధికారులు వెంటనే గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు గ్రామాల్లో రోడ్లుపై మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతున్నదని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేపట్టాలని కోరారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ ఆదేశాలతో డప్పు కొడుతూ ప్రచారం

నేరళ్లపల్లిలో డప్పు కొడుతూ ప్రచారం చేస్తున్న సిబ్బంది

తిమ్మాజిపేట, జూలై 23: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదేశాల మేరకు మండలంలోని నేరళ్లపల్లి గ్రామంలో మంగళవారం డప్పు కొడుతూ ప్రచారం చేశారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పాత ఇళ్లు, మట్టి మిద్దెల్లో నివసించరాదని, కరెంట్ స్తంభాలు, వైర్లను తాకకూడదని, పారుతున్న వాగులు వంకల వద్ద దాటే ప్రయత్నం చేయరాదని గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో తిమ్మాజిపేట ఏఎస్సై ప్రీస్లీ, హెడ్‌కానిస్టేబుల్ నర్సింహ, వెంకటయ్య, శ్రీనివాసులు, బాలస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలి

నాగర్‌కర్నూల్, జూలై 23 : నాగర్‌కర్నూల్ పట్టణంలోని 17వ వార్డులో అర్థాంతరంగా నిలిపి వేసిన అండర్ డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని మంగళవారం కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. డ్రైనేజీ పనులు మధ్యలోనే నిలిపివేయడంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా కాలనీలో ప్రైమరీ స్కూల్‌కి, ఆసుపత్రికి కేటాయించిన స్థలాలను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, ఆస్థలాలకు హద్దులు ఏర్పరచి రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు బాలరాజు, బహ్మం, చంద్రకళ, మధుప్రియ, రాణి, వెంకటేశ్, రేణుక, రాజేశ్వరి, షమీమ్‌బేగం, కోటమ్మ, సుజాత, దేవయ్య ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీలు సిగ్గుతో తలవంచుకోవాలి

వంగూరు, జూలై 23 : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి నిధులు కేటాయింపులు లేకపోవడంతో కాంగ్రెస్, బీజేపీలు తలదించుకుని తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ రాజేందర్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు చేరి 8 స్థానాల్లో గెలిపిస్తే వారు రాష్ట్రానికి నిధులు మంజూరు చేయించడంలో ఏమాత్రం శ్రద్ధ చూపలేదని తెలిపారు. వారికి ఆయా పార్టీల ఆదేశాలే తప్పా తెలంగాణ ప్రజలకు సేవా చేయాలనే ఆలోచన ఉండదన్నారు. అదే బీఆర్ఎస్ పార్టీ రెండు ఎంపీ స్థానాలు గెలిచినా కేంద్రం మెడలు వంచి నిధులను తీసుకొచ్చేదన్నారు. ఎప్పటికైనా తెలంగాణ ప్రజల బాగోగులు చూసే పార్టీ బీఆర్ఎస్‌నాని సూచించారు.

రైతు, గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

నాగర్‌కర్నూల్‌టౌన్, జూలై 23 : పార్లమెంట్‌లో మంగళవారం కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలో 9 రంగాల అభివృద్ధితోపాటు రైతు, గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్ ఉందని బీజేపీ నేత జక్కా రఘునందన్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యంగా ఈ బడ్జెట్ ఉందని పేర్కొన్నారు. నిరుద్యోగ నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ బడ్జెట్‌లో ఉపాధి కల్పనకు పెద్ద పాత్ర కల్పించినట్లు తెలిపారు.

కేసు నమోదు

బల్మూరు, జూలై 23 : మండలంలోని ఇప్పకుంట గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి పొలంలో టేకు చెట్లను కొట్టివేశారని మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై రేణయ్య తెలిపారు. ఆయన తెలిపిన కథనం మేరకు ఈనెల 20వ తేదీన సుధాకర్‌రెడ్డి వ్యవసాయ పొలంలో ఉన్న ఇప్పకుంట గ్రామానికి చెందిన తిరుపతయ్య, మల్లయ్యలు టేకు చెట్లు నరికి వేశారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి

- సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు
- కందనూలులో సీపీఎం నేతల నిరసన

అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న నాయకులు

నాగర్‌కర్నూల్, జూలై 23 : కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండిచేయి చూపిందని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ ప్రస్తావనే లేదని, రాష్ట్రవిభజనలో తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలను కూడా ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడంలో ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఉన్నటువంటి బీజేపీ ఈ రాష్ట్రానికి బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం జరుగుతున్నా చూస్తూ న్నారే తప్పా ఏం చేయలేని స్థితిలో ఉన్నారన్నారు. బడ్జెట్ పూర్తిగా తెలంగాణ రాష్ట్రానికి వ్యతిరేకమైందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్న ఈ బడ్జెట్‌ను మార్చాలని, తెలంగాణకు కేటాయింపులు జరగాలని, నాగర్‌కర్నూల్ జిల్లాకు రైల్వేలైన్ కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసులు, నాయకులు అశోక్, రామయ్య, కాశన్న, శ్రీనివాసులు, లింగం, క్రాంతి పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి

కల్వకుర్తి రూరల్, జూలై 23 : ముదిరాజ్ కులస్థులను బీసీ–డీ జాబితా నుంచి బీసీ–ఏ జాబితాలోకి మార్చాలని కోరుతూ కల్వకుర్తి పట్టణ, మండలానికి చెందిన ముదిరాజ్ కులస్థులు కల్వకుర్తి కార్యాలయంలో తాసీల్దార్ ఇబ్రహీంకు వినతిపత్రాన్ని అందించారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏ జాబితాలోకి మార్చాలని, పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తాసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాల్‌చందర్, శ్రీకాంత్, వెంకటయ్య, శ్రీధర్, శ్రీకాంత్, ఆంజనేయులు, సురేశ్, యాదయ్య, రాజశేఖర్, తిరుపతయ్య ఉన్నారు.

ఇంద్రకల్‌లో శిక్షణ కార్యక్రమం

తాడూరు, జూలై 23 : మండలంలోని ఇంద్రకల్ గ్రామాన్ని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పాలెం వారు దత్తత తీసుకున్నారు. అందులో భాగంగా మంగళవారం గ్రామంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశోధన స్థానం అధిపతి మల్లారెడ్డి మాట్లాడుతూ ఇంద్రకల్ గ్రామాన్ని 3 సంవత్సరాలపాటు దత్తత తీసుకోవడం జరిగిందని, గ్రామంలో ప్రతి నెల రెండు సార్లు గ్రామాన్ని సందర్శించి సాంకేతిక సలహాలు, పంటల్లో ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణ, పంట మార్పిడి పద్ధతులపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తునమన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు శంకర్, శ్రీధర్, సైదయ్య, విజయలక్ష్మి, శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారి రమేశ్, శివ ఉన్నారు.

బాలిక అదృశ్యం

తిమ్మాజిపేట, జూలై 23 : మండలంలోని ఎదిరేపల్లికి చెందిన ఓ మైనర్ బాలిక అదృశ్యమైనట్లు కుటుంబ స భ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటర్ చదివిన తమ అమ్మాయి ఇంటివద్దనే ఉంటుందని, గత 19వ తేదీన తాము పొలం పనులకు వెళ్లామని, తమ కుమారుడు కాలేజీకి వెళ్లగా ఇంటి వద్ద ఉన్న తమ కూతురు సాయంత్రం కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలోనూ తమ కూతురుని తిమ్మాజిపేటకు చెందిన ఓ వ్యక్తి తీసుకెళ్లాడని, ఈ విషయమై అప్పట్లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ప్రస్తుతం కూడా అతనిపైనే అనుమానం ఉందన్నారు.

పేకాటరాయళ్ల అరెస్ట్

కల్వకుర్తి రూరల్, జూలై 23 : కల్వకుర్తి పట్టణ సమీపంలో పేకాట స్థావరంపైన కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్సై మాధవరెడ్డి, పోలీసులు దాడులు నిర్వహించి నలుగురిని అరెస్ట్ చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకున్నది. కల్వకుర్తి ఎస్సై మాధవరెడ్డి కథనం మేరకు పట్టణ సమీపంలో పలువురు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో కల్వకుర్తి సీఐ, ఎస్సై పోలీసులు అక్కడకు చేరుకుని పేకాట ఆడుతున్న మెగులాల్, మధు, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డిల నుంచి రూ.20,200 నగదును స్వదీనం చేసుకొని వారిపైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎక్సైజ్ అధికారులు దాడులు

పెంట్లవెల్లి, జూలై 23 : మండలంలోని జటప్రోల్‌లో ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 6లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్ల కొల్లాపూర్ ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి తెలిపారు. దాడులో ఎక్సైజ్ ఎస్సై హనుమంతు, మంజుల, వెంకటేశ్, శ్రీశైలం ఉన్నారు.

కూతురి మృతి కారణమైన పాము చంపివేత

చారకొండ, జూలై 23: మండలంలో తుర్కలపల్లికి చెందిన ఏదుల యాదయ్య, సువర్ణల కూతురు రేణుక (4) సోమవారం రాత్రి పాము కాటుకు గురై మృతి చెందిన ఘటన విదితమే. ఇందుకు తమ ఇంటిని అనుసరించి ఉన్న పూరి గుడిసెలో గల పుట్టలోని పాము కాటు వేసి ఉండొచ్చని భావించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మంగళవారం జేసీబీ సాయంతో పూరి గుడిసెను ధ్వంసం చేశారు. గుడిసెలో ఉన్న పుట్టను తొలగించి రెండు పాములను చంపి కాల్చివేశారు. అనంతరం చిన్నారి పాప అంత్యక్రియాలను నిర్వహించారు.

'ప్రతి విద్యార్థి కొత్త ఆవిష్కరణలు చేయాలి'

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

నాగర్‌కర్నూల్, జూలై 23 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో యువతలో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటా ఇన్నోవేషన్ 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీవాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత నేడు సమాజంలోని వ్యవసాయం, దివ్యాంగుల సమస్యలు, ప్రభుత్వ పథకాలు, ట్రాఫిక్ నిబంధనలపై, ప్రమాదాల బారిన పడకుండా తప్పించుకొనుటకై కొత్త ఆవిష్కరణలు, సామాజిక సమస్యలపై అవగాహన కోసం ఇతర ఇన్నోవేటివ్ ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు చేయాలన్నారు. వాటిని 100 పదాలకు మించకుండా లేదా రెండు నిమిషాల నిడివి గల వీడియోలు తయారు చేసి 9100678543 నెంబర్‌కు వాట్సప్ ద్వారా పంపాలన్నారు. వాటిని ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం రోజు జిల్లా అధికారులు పరిశీలించి తగిన ప్రోత్సహించాలని ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మాధవి మాట్లాడుతూ విద్యార్థులకు ఈ వయస్సు నుంచే సైంటిఫిక్ ఆలోచనలు వాటిని డెవలప్ చేసే విధానాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నర్సింహులు, రవిప్రకాశ్, హరిత, భయ్యా రాజయ్య, గపూర్, సిద్ధిఖీ, ప్రసన్నలక్ష్మి, శిరీష, పరమేశ్వరి, చంద్రశేఖర్, విష్ణు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

లింగాల, జూలై 23 : మండలంలోని కొత్తకుంటపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ లీడ్ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలు, బ్యాంకుల్లో అందించే సేవింగ్స్ రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్‌సీసీ జనార్దన్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు మన్సూర్, రూపేశ్, మాజీ సర్పంచ్ పర్వతాలు, సింగిల్ విండో డైరెక్టర్ బాలరాజుగౌడ్, నాయకులు జైపాల్‌రెడ్డి, ఫీల్ట్ అసిస్టెంట్ రాజీవ్ ఉన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

అచ్చంపేటటౌన్, జూలై 23 : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ సయ్యద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వివిధ కళాశాల హాస్టల్‌లో సర్వే నిర్వహిస్తూ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని పట్టణ కేంద్రంలో వివిధ కళాశాలలో కమిటీలు నియమించారు. అదేవిధంగా విద్యార్థులకు సమయపాలన పాటిస్తూ బస్సులను కేటాయించాలని ఆయన కోరారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

పెంట్లవెల్లిలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై రామన్‌గౌడ్

పెంట్లవెల్లి, జూలై 23 : వాహనాదారులు పోలీస్ నిబంధనలు తప్పక పాటించాలని ఎస్సై రామన్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం సమీపంలోని ప్రధాన రహదారిపై రాకపోకలను కొనసాగించే వాహనాలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు పోలీస్ నిబంధనల ప్రకారం డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా ఇటీవల కురుస్తున్న ముసురు వర్షాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాజన్‌గౌడ్, విష్ణుమూర్తి, వేణు ఉన్నారు.

విద్యాభివృద్ధికి సహకరిస్తా..

కల్వకుర్తి రూరల్, జూలై 23 : పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతుగా సహకరిస్తానని రిటైర్డు హెచ్ఎం రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన నామని రాజేందర్ ద్వితీయ కుమార్తె తేజస్విని పదో తరగతి పరీక్షల్లో పది జీపీఏ సాధించడంపై అభినందించి తన ఉన్నత విద్యాభ్యాసం కోసం రూ.10వేల నగదును ప్రోత్సాహకంగా అందించారు. ఈ సందర్భంగా రాజేందర్ మొదటి కుమార్తె యశస్విని రామకృష్ణారెడ్డికి చిత్రపటాన్ని బహుమతిగా అందించింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వంగూరు/ఊర్కొండ, జూలై 23 : ఇటీవల కురుస్తున్న వరాలకు వంగూరు, ఊర్కొండ మండలాలకు చెందిన ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వంగూరు, ఊర్కొండ మండలాల ఎస్సైలు మహేందర్, వీరబాబులు మంగళవారం వేర్వేరుగా సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లోని మట్టి ఇళ్లను వారు పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లల్లో ఉండొద్దని ప్రజలకు సూచించారు.

దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలి

అచ్చంపేటటౌన్, జూలై 23 : స్మితా సబర్వాల్ దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలని సీపీఐఎం పార్టీ మండల కార్యదర్శి మల్లేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్మితా సబర్వాల్ దివ్యాంగుల మనోభావాలను దెబ్బ తినేలా చేసిన ఈ వ్యాఖ్యలను వెంటనే ఆమె వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

కొల్లాపూర్, జూలై 23 : కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు శేఖర్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కొల్లాపూర్ పట్టణంలోని ఆర్ఐడీ పాఠశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లోనైనా విద్యారంగానికి ఎక్కువ నిధులు కేటాయించాలన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు మధ్యాహ్నం భోజనం మెస్ చార్జీలు పెంచాలని పేర్కొన్నారు. శిథిలావ్యవస్థకు చేరిన భవనాలను కూల్చివేసి నూతన భవనాలను నిర్మాణం చేపట్టాలని, ఖాళీగా ఉన్న ఎంఈవో, డీఈవో పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్సైకి బీఆర్ఎస్ నాయకుల సన్మానం

వెల్దండ, జూలై 23 : మండల నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన కురుమూర్తిని బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సైని కలిసిన బీఆర్ఎస్ నాయకుడు గండికోట రాజు పూలమాల, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు శ్రీను, ఏఎస్సై కుమారస్వామి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అచ్చంపేటరూరల్, జూలై 23 : పట్టణంలోని రాజీవ్‌నగర్ డబుల్ బెడ్రూం కాలనీలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎల్.దేశ్యానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన డబుల్ బెడ్రూం కాలనీని పరిశీలించారు. 6 బ్లాక్‌లకు మురుగుదొడ్ల కలెక్షన్ ఇవ్వకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ప్రధాన రహదారి నుంచి సీసీ రోడ్డు వేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆర్యకంటి నిర్మల, కాలనీ వాసులు పెంటమ్మ, కాశమ్మ, కలమ్మ, సురేశ్, ఆరీఫ్, నాని, సాయికుమార్, ప్రసాద్, గౌస్, ఇమ్రాన్, అనిల్ ఉన్నారు.

గోప్లాపురం గ్రామంలో..

పెంట్లవెల్లి, జూలై 23 : మండలంలోని గోప్లాపురంలో మంగళవారం సీపీఎం నాయకులు పర్యటించి వివిధ కాలనీల్లో నెలకొన్న పారిశుధ్యతోపాటు పలు సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీ సమస్య ఉందని, వీధిలైట్లు రాత్రి సమయంలో వెలగడం లేదని తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాని గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వర్ణలతకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు, శ్రీనివాసులు, సుధాకర్, లక్ష్మయ్య, మంగమ్మ, పుల్లమ్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య సేవలు

పెద్దకొత్తపల్లి, జూలై 23: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లోని పలు కాలనీల్లో ఇండ్ల మధ్య నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకు ముందస్తుగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సరిపడా మందులు ప్రజలకు అందిస్తున్నామని పేర్కొన్నారు. మండలంలోని తీర్నాంపల్లిలో చెంచు కుటుంబాలందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి టైఫాయిడ్, మలేరియా వ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించారు. తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

కల్వకుర్తి/కల్వకుర్తి రూరల్, జూలై 23 : కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో స్టేట్ ర్యాంకులు సాధించిన ఆదిలక్ష్మి, అమూల్య, దీప్తిలకు స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల జీహెచ్ఎం నిర్మల, సీనియర్ సిటిజన్ లక్ష్మారెడ్డి రూ.25వేల ఆర్థిక సాయాన్ని అందించారు. మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీహెచ్ఎం నిర్మల ర్యాంకుల సాధించిన విద్యార్థులను అభినందించారు.

జిల్లెల్ల గ్రామంలో..

కల్వకుర్తి రూరల్, జూలై 23 : కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన డొక్కా చంద్రయ్య మంగళవారం మృతి చెందాడు. విషయం తెలిసిన మాజీ సర్పంచ్ రాములు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.3వేలు ఆర్థికసాయం అందజేశాడు. ఆయన వెంట నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రవిగౌడ్ ఉన్నారు.

విద్యుదాఘాతానికి మూగజీవి మృతి

కోడేరు, జూలై 23 : విద్యుదాఘాతానికి గురై ఓ మూగ జీవి మృతి చెందిన ఘటన మండలం కేంద్రంలో మంగళవారం చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు కోడేరుకు చెందిన కొమ్ము చిన్నరాములు తనకు ఉన్న గొర్రెలు, మేకలను రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో మేత తీసుకెళ్లాడు. సాయంకాలం ఇంటికి తిరిగి వస్తుండగా రోడ్డు పక్కన ఉన్న బురాన్ ఇంటిపైకి ఒక మేక వెళ్లింది. ఆ ఇంటిపై ఉన్న 11కేవీ విద్యుత్ తీగలను తాకడంతో మేక అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో కాలనీవాసులు, రైతు కుటుంబం కలిసి ఆందోళనకు దిగారు. దీంతో స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ లైన్‌మేన్ ప్రభాకర్ ఘటన స్థలానికి వచ్చి రైతును ఓదార్చారు. పైఅధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్‌శాఖ డీఈ మాట్లాడుతూ 20 రోజుల్లో ఇండ్లపై ఉన్న 11కేవీ విద్యుత్‌లైన్‌ను తొలగిస్తామని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ఆందోళనను విరమించారు.